క్లుప్తంగా

గొడుగులు, పౌష్టికాహారం పంపిణీ



కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌పీసీఎల్ అధికారుల సతీమణులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని ముఖ్యమైన కూడళ్ల, ఫుట్‌పాత్‌లపై తల దాచుకునే నిరుపేదలతో పాటు భిక్షాటన చేసుకునే వారికి గొడుగులు, పౌష్టికాహారాన్ని బుధవారం పంపిణీ చేశారు. హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ)లో వివిధ హోదాల్లో పని చేస్తున్న అధికారుల సతీమణులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి సొంత నిధులతో సుమారు 100 మందికి గొడుగులు, పౌష్టికాహారం అందించారు. జింక్ నుంచి సింధియా వరకు గల ఫుట్‌పాత్‌లపై ఉండే వారికి వీటిని అందించినట్లు చెప్పారు. నెలలో ఓ రోజు తాము ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

15, 16 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ జోన్–6లోని 68వ వార్డు పరిధిలో ఈ నెల 15,16 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు ఎస్. శేఖర్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మింది నీటి శుద్ధి కేంద్రం 4.50 ఎంజీడీ ప్లాంట్ పైప్‌లైన్ ఫిల్టర్ చాంబర్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. దీంతో 15, 16 తేదీల్లో బీహెచ్‌ఈఎల్, విశాఖ డెయిరీ, ఐఎన్ఎస్ ఏకశిల, విశాఖ వైర్ రోప్స్ మింది, రాంనగర్, కాళికనగర్, అప్పన్నకాలనీ, రాజీవ్‌నగర్ తదితర ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎంప్లాయీస్ యూనియన్ గుర్తింపుపై హర్షం



స్టీల్ సిటీ డిపోలో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఈయూ నాయకులు

ఉక్కునగరం: ఎంప్లాయీస్ యూనియన్‌ను ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు యూనియన్‌గా ప్రకటించడంపై స్టీల్ సిటీ డిపోలో యూనియన్ ప్రతినిధులు బుధవారం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత మెజార్టీ సంఘంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తిని మన్నించి గుర్తించినందుకు డిపో ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ధన్యావాదాలు తెలిపారు. డిపో కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారంతో పాటు సంస్థకు మరింత మేలు జరిగేలా పని చేస్తామన్నారు. గుర్తింపు రావడానికి సహకరించిన ఏపీ జాక్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎం.గోపాలుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హెచ్.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందంలో నాయకులు



సింహాచలం డిపో వద్ద సంబరాలు చేసుకుంటున్న ఎన్‌ఎంయూఏ కార్మికులు

గోపాలపట్నం : సింహాచలం ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు ప్రభుత్వ గుర్తింపు రావడంతో నాయకులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సింహాచలం డిపో వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. అసోసియేషన్ రీజనల్ చైర్మన్ ప్రాన్ మాట్లాడుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్‌కు గుర్తింపు రావడానికి కార్మికుల ఐక్యతే కారణమన్నారు. ఈ సందర్భంగా ఎండీ, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం కార్మికులకు అంకితమిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సింహాచలం డిపో అధ్యక్షుడు బీడీ నాయుడు, కార్యదర్శి జేస్‌ఎస్ రాజు, ముఖ్య సభ్యులు పాల్గొన్నారు.



సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

- పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్
- రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆనంద్ కుమార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్ కుమార్

విశాఖ విద్య: పశ్చిమ నియోజక వర్గ అభివృద్ధే లక్ష్యంగా నిధులు మంజూరు చేయిస్తున్నట్లు ఏపీఎంఎస్ఎంఈడీ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. 90 వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందిన సుమారు 400 మందికి బ్రోచర్లు అందజేశారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు అధ్యక్షులు నమ్మి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జీవీఎంసీ కో–ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జి చుక్క ప్రసాద రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి జి. మురళీ కృష్ణ, నాయకులు యల్లపు వెంకటేశ్వరరావు, బోర అప్పలరెడ్డి, రమేష్, లోకేష్ రెడ్డి, గోవింద రాజు, రమణమ్మ, కర్రి లక్ష్మి, నమ్మి ఎర్రజి, నంబల లక్ష్మి, కమలమ్మ, చిన్నారావు, సన్యాసిరావు, సత్యవతమ్మ , సత్య జీవీఎంజీ, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు గృహ రథసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

జీవీఎంసీ 90 వార్డు ఎస్.ఎస్.టి.ఎల్ దరి తహసీల్దార్ కార్యాలయం దగ్గర రూ.3 లక్షల జనరల్ ఫండ్స్, అదే విధంగా విమాన నగర్ రజక కాలనీలో రూ.20 లక్షలు జీవీఎంసీ నిధులతో నూతనంగా నిర్మించతలపెట్టిన సీసీ రోడ్ల పనులకు ఆనంద్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ కాలనీల్లో మౌలిక సౌకర్యాల పెంపునకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

90వ వార్డు వినోద్ నగర్‌కు చెందిన కాకర వెంకటరమణి, మాధురి సావిత్రమ్మలకు ఏటీఆర్ ట్రస్టు ద్వారా ఉచితంగా వీల్ చైర్లను విశాఖ డెయిరీ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ సేవా దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు.

ఉత్సాహంగా నూతన పింఛన్ల పంపిణీ



నూతన పింఛన్లు అందజేస్తున్న 62వ వార్డు సచివాలయ కన్వీనర్లు



పింఛన్ అందజేస్తున్న విజయ్‌కుమార్



లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న బెహరా భాస్కరరావు

సింధియా: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యపడుతుందని 62వ వార్డు సచివాలయ కన్వీనర్లు అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులోని పలు సచివాలయ పరిధిలో కొత్తగా మంజూరైన వృద్ధాప్య, వితంతు తదితర సామాజిక పింఛన్లు అర్హులైన లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఉపయోగకరమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో సచివాయల కన్వీనర్లు నక్కా సూర్యనారాయణ, భారతి, ఆదిపురెడ్డి సత్యనారాయణ, నాగభూషణం, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డులోని నాలుగు సచివాలయాల పరిధిలో నూతనంగా 16 మందికి వైఎస్సార్ పింఛన్లు మంజూరయ్యాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచనల మేరకు లబ్ధిదారులకు వార్డు యువజన నాయకుడు జియ్యాని విజయ్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం నెలకు రూ.2750లు ఇస్తుండగా, త్వరలోనే ఇది రూ.3 వేలకు పెంచుతారన్నారు. అర్హుల అందరికీ పింఛన్లు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వెదుళ్ల శ్రీను, వార్డు సచివాలయ సెక్రటరీ నాగేశ్వరరావు, నీలమణి, శ్రీనివాసరాజు, చందనాల రాజు తదితరులు పాల్గొన్నారు.

91,92 వార్డుల్లో..

గోపాలపట్నం: జీవీఎంసీ 91, 92 వార్డుల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో బుధవారం లబ్ధిదారులకు అందించారు. 91వ వార్డులో 73, 92వ వార్డులో 99 కొత్త పింఛన్లు వచ్చాయన్నారు. పేదలకు న్యాయం జరగాలన్న లక్ష్యంతో ఈ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.

ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: వచ్చే ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు పిలుపునిచ్చారు. కుమారి కల్యాణ మండపంలో బుధవారం జీవీఎంసీ 91, 92వ వార్డు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశాలతో సమావేశం నిర్వహించామన్నారు. ప్రభుత్వ పథకాల గురించి, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరించాలన్నారు. పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ చేస్తున్న సేవలు, ప్రజలతో మమేకమవుతున్నా తీరును ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు పశ్చిమంలో తిరుగులేని విజయాన్ని సాధించాలని పిలుపునిచ్చారు. ఇందుకు కార్యకర్తల కృషి అవసరమన్నారు. సమావేశంలో 92వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, గుణిశెట్టి శ్రీనివాసరావు, వైఎసార్ సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీ కృష్ణ, నాయకులు ఊటపల్లి గోవిందు, చుక్క పైడిరాజు రెడ్డి, దేరెడ్ల సత్యానారాయణ, చుక్క రమణ, రాజశేఖర్, ప్రేమ్ కుమార్, భారతి, ఉష, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు పారిశ్రామికవాడలో పర్యటించనున్న ఆనంద్

మల్కాపురం : ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గురువారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల్లో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా తొలుత ఆయన 61వ వార్డు మల్కాపురంలోని కృష్ణా బార్ అండ్ రెస్టారెంట్ వెనుక రోడ్డులో జరిగే మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పలువురికి ఆ ప్రతిమలు అందిస్తారు. అనంతరం ఉదయం 11 గంటలకు మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద ఇటీవల నూతనంగా మంజూరైన ప్రభుత్వ పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆయన వార్డుల్లో పర్యటించి ఆయా వార్డుల ప్రజా సమస్యలు తెలుసుకుంటారు.

విద్యార్థులకు బంగారు బాట వేసేది ఉపాధ్యాయులే..



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం : విద్యార్థుల తల రాత మార్చి వారికి బంగారు భవిష్యత్తు అందించగలిగేది ఉపాధ్యాయులు మాత్రమే అని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. 59వ వార్డు పాత చెక్‌పోస్టు ఏరియా వద్ద గల వైఎస్సార్ సీపీ క్యాంప్ కార్యాలయంలో విద్యార్థులకు చక్కటి బోధన అందించిన ఉపాధ్యాయులను, పది, ఇంటర్‌లో చక్కటి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో బద్రీనాథ్ మాట్లాడుతూ మాట్లాడుతు విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, ఉపాధ్యాయుల బోధనలను సద్వినియోగం చేసుకుంటే చక్కటి ఫలితాలు వస్తాయన్నారు. వృత్తి పట్ల నిబద్ధత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పుడు అటువంటి పాఠశాలల్లో చదివే విద్యార్థులు చక్కగా ఉత్తీర్ణులవుతారని తెలిపారు. విద్యార్థులంతా తమ ఉపాధ్యాయుల పట్ల గౌరవభావంతో మెలుగుతూ వారి సూచనలు పాటించాలన్నారు. తద్వారా తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంగ రామ్‌ప్రసాద్, ఆడారి హరీష్, హనుమంతరావు, మనోహర్, భీమ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పేదలకు వరం



మృతుని కుటుంబానికి బీమా తక్షణ సాయం అందిస్తున్న రామ్మోహనరెడ్డి

సింధియా: వైస్సార్ బీమా పేద ప్రజలకు వరం లాంటిదని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. వార్డు పరిధి కాకరలోవకు చెందిన అంపోలు జోజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతుడు వైఎస్సార్ బీమా కలిగి ఉండడంతో అతడి భార్య అంపోలు జ్యోతికి వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, వార్డు అధ్యక్షుడు సోమాధుల సురేష్ తక్షణ సాయం రూ.10 వేలు అందజేశారు. మిగిలిన రూ.90 వేల నగదు మృతుని నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో వార్డు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొట్నాన రవి, నాయకులు వెలగాడ రాజు, పునుకు రమణ, లోకొండ అప్పారావు, కుమార్, ప్లానింగ్ సెక్రటరీ రాజు, రమణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్కాపురం : వార్షిక మరమ్మతుల కారణంగా శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధి పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్స్) బీకే నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరాకాలనీ–1,2 ప్రాంతాలతో పాటు బర్మాకాలనీ, వీటీ కాలేజీ రోడ్డు ఏరియా, జవహర్‌నగర్ రోడ్డు, పవన్‌పుత్రనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జీవరాశుల మనుగడకు వృక్షాలే ఆధారం



ప్రసంగిస్తున్న ఆచార్య జి.సాల్మన్‌రాజు

ఏయూ క్యాంపస్: జీవరాశుల మనుగడకు వృక్షాలు ఆధారంగా నిలుస్తాయని ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యుడు జి.సాల్మన్‌రాజు తెలిపారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర పునశ్చరణ తరగతుల్లో అధ్యాపకులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న అడువులు, వృక్ష వైవిధ్యత, పుష్పాలు, వృక్షాలతో ఇతర జీవులకు ఉన్న అనుబంధం కళ్లకు కట్టినట్లు వివరించారు. కీటకాలు, పక్షులకు వృక్షాలు ఆధారంగా నిలుస్తున్న విధానాన్ని ఫొటోలతో సహ అవగాహన కల్పించారు. కలువు మొక్కల నుంచి వచ్చే పువ్వులు సైతం సీతాకోక చిలుకలు, తేనెటీగలు, పక్షులకు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. ప్రధానంగా వేసవిలో అనేక పక్షులు, జీవులకు ప్రాణాధారంగా వృక్షాలు నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. శేషాచలం అడవుల్లో దర్శనమిచ్చే వివిధ ఔషధ, సుగంధ వృక్షాల ప్రత్యేకతలను వివరించారు. తూర్పు, పశ్చిమ కనుమల్లో ఉండే వృక్ష వైవిధ్యతలు, గిరిజన ప్రాంతాలలో ఉండే చెట్లు, పుష్పాల విశిష్టతను తెలియజేశారు. పలు పుష్పాలు పురుగులను ఆకర్షించి తిగిరి వెళ్లనివ్వకుండా మరణించేలా చేస్తాయని, వీటిని కిల్లర్ ఫ్లవర్‌గా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకటకృష్ణ, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్'కు లాభం చేకూర్చేందుకే ప్రైవేటీకరణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనతోనే ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 944వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కేవలం రూ.10 కోట్ల ఖర్చుతో 1700 టన్నుల ఆక్సిజన్ తయారుచేస్తోందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో ప్రైవేట్‌వారికి రూ.50 కోట్లు ఖర్చు చేయడానికి అంగీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ 2700 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తోందని, మరో 1700 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. కానీ నేడు కేంద్రప్రభుత్వం ప్లాంట్‌ను నడపలేమని చెప్పడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, ఆయోధ్యరామ్, పరంధామయ్య, ఎస్ఎంఎస్–1 ప్రతినిధులు విడివి పూర్ణచంద్రరావు, రమణమూర్తి, ముత్యాల నాయుడు, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వారి వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఘనంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

ఆచార్యుడు రాధాకృష్ణ మృతికి సంతాపం



డాక్టర్ రాధాకృష్ణ చిత్ర పటానికి నమస్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎల్.రాధాకృష్ణ (50) అకాల మృతికి విభాగ ఆచార్యులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. బుధవారం విభాగంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో రాధాకృష్ణ చిత్రపటానికి ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రాధాకృష్ణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏవీఎన్ కళాశాల నుంచి 2020లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చిన రాధాకృష్ణ ఎంతో నిబద్ధతలో సేవలు అందించారని కొనియాడారు. స్వశక్తితో ఎదిగి, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మంచి వ్యక్తిని కోల్పోవడం తీరని లోటన్నారు.

ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదు

- విద్యార్థులు స్నేహభావం కలిగి ఉండాలి
- జిల్లా అదనపు న్యాయమూర్తి వాణిశ్రీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి వాణిశ్రీ

దాబాగార్డెన్స్ : విద్యార్థులు స్నేహ భావం కలిగి ఉండాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టం 1997పై బుధవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, న్యాయ వ్యవస్థపై గౌరవభావం కలిగి ఉండడం అవసరమన్నారు. జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేసే విధానం ఎన్నో ఏళ్ల నుంచి కళాశాల స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా చట్టం ఏర్పడిందని, ఈ చట్టానికి లోబడి ప్రతి పౌరుడు ఉండాల్సిందేనన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు పౌర సమాజంలో ఎన్నో మంచి మార్పులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యేసయ్య, ఆనంద్, వెంకటరత్నం, గాయత్రీ, వినీత ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై మాట్లాడారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఆంధ్రా మెడికల్ కళాశాల ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఎస్ఎన్ రాజు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీలత, లీగల్ సెల్ అథారిటీ ప్యానెల్ న్యాయవాది కె. అప్పలనాయుడు, ఏవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఎంవీఐ బుచ్చిరాజు

అగనంపూడి: వాహన చోదకులు రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను చాలా వరకు కట్టడి చేయవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం నేరమని తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సుందర్ రామమ్, డీన్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'తెలుగు భేరి' విలువైన గ్రంథం



తెలుగు భేరి గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

సీతంపేట: తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పే విలువైన గ్రంథం తెలుగు భేరి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో తెలుగుదండు వ్యవస్థాపకుడు పరవస్తు ఫణిశయన సూరి రచించిన 'తెలుగు భేరి' గ్రంథ పరిచయం, ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. సాహితీవేత్త సిహెచ్.చిన సూర్యనారాయణ గ్రంథ పరిచయం చేశారు. పరిమళించే పూలను ఏరి మాలగుచ్చి తెలుగు తల్లి మెడలో వేసిన రీతిన ఫణిశయన సూరి తెలుగు భేరి గ్రంథాన్ని రచించారన్నారు. అనేక తెలుగు గ్రంథాలు చదవలేని పాఠకులు ఈ సంకలనం చదివితే చాలని చెప్పారు. దీనిలో ప్రముఖ తెలుగు కవులు రచించిన పద్యాలు, గేయాలు, వచన కవితలు, జానపదాలు ఒకచోట చేర్చబడ్డాయన్నారు. కావ్యాలు, శతకాల నుంచి ప్రక్రియలను, నన్నయ నుంచి ఆధునిక కవుల వరకు ఈ గ్రంథంలో పరిచయం చేశారని వివరించారు. శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రచయితలు డి.వి.సూర్యారావు, పరవస్తు పణిశయన సూరి, భాగవతుల సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

